క్లుప్తంగా

మొహర్రం వేడుకలు

మణుగూరురూరల్: మండల పరిధిలోని శివలింగాపురం, పీవీకాలనీల్లో మొహర్రం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. హిందూ ముస్లింల ఐకమత్యానికి ప్రతీకగా మొహర్రాన్ని జరుపుకున్నారు. మొహర్రాన్ని పురస్కరించుకుని ముస్లింలు పీర్లను ఊరూరా తిప్పుతూ భక్తిభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి ఖాసీం, కొత్తపల్లి లక్ష్మయ్య, కొత్తపల్లి సీతారాములు, మహేష్, సైదులు, సాంబశివరావు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ సైకిల్ యాత్ర

అశ్వారావుపేటరూరల్: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర శనివారం అశ్వారావుపేటకు చేరింది. సైకిల్ యాత్రకు స్థానిక నాయకులు రింగ్‌రోడ్ సెంటర్‌లో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్ర మేనేజర్, సంఘం జిల్లా అధ్యక్షుడు గార్లపాడు పవన్ కుమార్, జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రకటించి తొమ్మిదేళ్లు పూర్తైనప్పటికీ దాని ఊసేలేదన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించడం లేదని, ఖాళీ టీచర్ల పోస్టులు భర్తీ చేయడం విఫలమయ్యారని అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న ప్రారంభించిన యాత్ర.. వచ్చే నెల 7వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పిట్టల అర్జున్, తానం వంశి, బోడా అభిమిత్ర, అభిమాన్యు, పాటల గోపి నాగకృష్ణ, వెంకటేష్, రామ్ చరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ ఏర్పాటు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక గ్రామ సమీపంలోని ఖబరస్తాన్ స్థలానికి చుట్టు శనివారం ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఖబరస్తాన్ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానిక ముస్లింలు ఇటీవలె అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును కలిసి వినతి చేశారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. ఖబరస్తాన్ స్థలానికి రక్షణ కల్పించడంపై గ్రామ ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు.

వైద్య శిబిరం

దమ్మపేట: మండల పరిధిలోని దుర్గంగొల్లగూడెం గ్రామంలో ఉన్న బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో పట్వారిగూడెం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు దివాకర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ జ్వర పరీక్షలు చేసి, చిన్న అనారోగ్య సమస్యలు ఉన్న వారికి తగు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వర్షాకాలం సీజన్‌లో సంక్రమించే వ్యాధుల గురించి విద్యార్థులకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు

మణుగూరురూరల్: భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామపంచాయతీలో సర్పంచ్ కాయం తిరుపతమ్మ ఆధ్వర్యంలో శనివారం శానిటేషన్ పనులు నిర్వహించారు. వర్షాలకు గ్రామపంచాయతీ ప్రధాన రహదారి వెంబడి, అంతర్గత వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులతో తొలగించి శుభ్రం చేయించారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా రోడ్డుకు ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని నారాయణపురం గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి అంటు వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు కలుషితం, జ్వరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు పరిటాల సందీప్, చిన్నంశెట్టి నాగేంద్ర, పసుపులేటి నరేష్, పెద్దపూడి సత్యవతి పాల్గొన్నారు.

భట్టిని కలిసిన జెడ్పీటీసీ

ములకలపల్లి: సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను శనివారం జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి కలిశారు. వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనకు భద్రాచలం వచ్చిన భట్టిని మర్యాదపూర్వకంగా కలిసి, స్థానిక సమస్యలను విన్నవించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, అంజుం, పుప్పాల హనుమంతు తదితరులు ఉన్నారు.

పప్పు సరఫరా చేయాలి

అశ్వారావుపేటరూరల్: గడిచిన మూడు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిపోయిన పప్పులు తక్షణమే సరఫరా చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు పప్పులు సరఫరా చేయకపోవడంతో చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం ఏ విధంగా అందుతుందని ఆయన ప్రశ్నించారు. మెనూ చార్జీలు, మినీ టీచర్లకు, ఆయాలకు కనీస వేతనాన్ని రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాజేశ్వరి, నాగమణి, కృష్ణవేణి, ప్రమీల, ప్రభావతి, ఆర్‌కేఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాంతించని గోదావరి..

భద్రాచలంలో మూడో ప్రమాద హెచ్చరికను దాటి గోదావరి ప్రవహిస్తోంది. శుక్రవారం నుంచి శనివారం వరకు గంటగంటకు ప్రవాహం పెరగడమే తప్ప తగ్గిన దాఖలాలు లేవు. దీంతో ముంపు ప్రాంతాల కాలనీల నుంచి ప్రజలందరినీ పునరావాస శిబిరాలకు తరలించారు. గత ఏడాది చేదు జ్ఞాపకాలను తలుచుకుంటూ సామగ్రితో సహా కేంద్రాలకు వచ్చిన బాధితులు వరద ఎప్పుడు తగ్గుతుంది.. ఎప్పుడు ఇళ్లకు చేరతామా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. మరోపక్క బాధితులకు ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకుల పరామర్శలు కొనసాగుతున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్


కూనవరం రోడ్డులో పంట పొలాలను ముంచెత్తిన గోదావరి వరద


గోదావరి బ్రిడ్జిపై కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్‌తో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ


స్లూయిజ్‌ల వద్ద మోటార్లు, నీటి డంపింగ్‌ను పరిశీలిస్తున్న సీఎల్పీ నేత భట్టి, ఎమ్మెల్యే పొదెం


అస్తికలు కలపడానికి వచ్చిన భక్తులను అడ్డుకుంటున్న పోలీసులు


భోజనం పెట్టలేదని నిరసన తెలుపుతున్న నిర్వాసితులు


భోజనం కోసం క్యూలైన్‌లో పెట్టిన పాత్రలు


భోజనం ఆలస్యం కావడంతో ఆర్డీఓతో వాగ్వాదానికి దిగిన స్థానికులు


స్నానఘట్టాల వద్ద ఉన్న ఆలయాల్లోకి ప్రవేశించిన వరద



కూనవరం రహదారిపైకి వరద చేరడంతో నిలిచిపోయిన వాహనాలు

కొనసాగుతున్న వరద పోటు

- వెనక్కి తగ్గని గోదారి నీటిమట్టం
- జల దిగ్బంధనంలోనే చర్ల మండలం
- పునరావాస కేంద్రాల్లో బాధితులు

చర్ల: చర్ల మండలం రెండో రోజు కూడా జల దిగ్బంధనంలోనే ఉంది. దోబూచులాడుతున్న గోదావరి వరద ప్రజానీకాన్ని క్షణం క్షణం భయాందోళనకు గురి చేస్తోంది. రెండు రోజులుగా వరదనీరు రహదార్లను ముంచెత్తగా రాకపోకలు పూర్తిగా నలిచిపోయి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని 14 గ్రామాలకు చెందిన 653 కుటుంబాల వారిని 12 పునరావాస కేంద్రాలకు తరలించగా వారు మూడు రోజులుగా పునరావాస కేంద్రాల్లోనే ఉంటున్నారు. మండలంలోని కుదునూరు–దేవరాపల్లి మార్గంలోని ప్రధాన రహదారిపై నాలుగు అడుగుల మేర వరదనీరు చేరింది. సుబ్బంపేట–ఎదిరగుట్టల మధ్యలోని ప్రధాన రహదారిపై మూడు అడుగుల మేర నీరు నిలిచింది. అదే విధంగా కొత్తపల్లి–దండుపేట, లింగాపురంపాడు–లింగాపురం గ్రామాల మధ్యలోని అంతర్గత రహదార్లు సైతం వరదనీటిలోనే ఉన్నాయి. గత రెండు రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వస్తున్న గోదావరి వరద ఉధృతి శనివారం ఉదయం నుంచి క్రమేపీ పెరుగుతూనే ఉంది. రహదారులను వరదనీరు ముంచెత్తిన ప్రాంతాల్లో ప్రజలు నీళ్లల్లో నుంచి రాకపోకలు సాగించి ప్రమాదాల బారినపడకుండా ఉండేందుకు సీఐ అశోక్ నేతృత్వంలో ఎస్సైలు వెంకటప్పయ్య, సూరి, చంద్రశేఖర్‌లు ఆయా ప్రాంతాల్లో గస్తీ తిరుగుతూ ప్రజలు అటు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.


కుదునూరు–దేవరాపల్లి మధ్యలో ప్రధాన రహదారిపై నిలిచిన గోదావరి వరద

వరద బాధితులకు సేవలు

మణుగూరురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మణుగూరు మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత పునరావాస కేంద్రాన్ని పరిశీలించి వరద బాధితుల వివరాలను, కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, రెవెన్యూ, పోలీస్, మండలపరిషత్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఏర్పాటు చేసిన గోదావరి ముంపు పునరావాస కేంద్రాలలోని బాధితులకు మండల న్యాయ సేవ సంస్థ, భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం విరతణ అందజేశారు. పునరావాస కేంద్రాలను సందర్శించిన వారు బాధితులకు దుప్పట్లు, అరటి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సీహెచ్ వెంకటేశ్వర్లు పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీసీ ఆధ్వర్యంలో..

బూర్గంపాడు: గోదావరి వరద బాధితులకు ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో సేవలను అందించారు. సారపాకలోని భద్రాచలం పబ్లిక్‌స్కూల్‌లోని పునరావాస కేంద్రాలలో ఉన్న 650మంది వరద బాధితులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నారు. తాగునీరు, పాలు, బ్రెడ్లు అందజేస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో క్లబ్ అధ్యక్షుడు జేకే దాస్, రోటరీ ప్రతినిధులు హరినారాయణన్, కె.రాంబాబు, శ్యామ్‌కిరణ్, చెంగలరావు, కన్నయ్యచౌదరి, శివరామకృష్ణన్, మరదాన శ్రీనివాస్, చాంద్‌పాషా, నాగమల్లేశ్వరరావు, రంజిత్‌కుమార్, ప్రతాప్, సుధీర్, ఎన్.మురళి, ఖాదర్‌వలి, అరుణ్‌సాయి, శంకర్, మురళీకృష్ణ తదితరులు బాధితులకు సేవలను అందిస్తున్నారు.


మణుగూరురూరల్: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

వడ్డెర సంఘం ఆధ్వర్యంలో..

అశ్వారావుపేటరూరల్: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు శనివారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నిత్యావసరాలను అందించారు. మండలంలోని వినాయకపురం, అశ్వారావుపేటలోని వడ్డెర బజారుకు చెందిన 40 కుటుంబాలు వర్షాలు కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకుని, ఆయా కుటుంబాలకు బియ్యం, పలు రకాల నిత్యావసరాలు, కూరగాయలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వడ్డెర సంఘం బాధ్యులు తమ్మిశెట్టి శ్రీను, పల్లపు వెంకటేశ్వర్లు, తేపర్ల దుర్గారావు, బోదాసు కనకరాజు, నాగముత్యం, ఇరగదాండ్ల రాంబాబు, వల్లెపు శ్రీను, బండారు వెంకటేశ్వరరావు, కొడయ్య పాల్గొన్నారు.

ఇక్కడ తగ్గి.. అక్కడ పెరుగుతోంది!

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండలంలో ఉన్న రెండు ప్రధాన సాగునీటి వనరులుల్లో ఒక దాంట్లో వరద తగ్గుముఖం పట్టగా, మరొక దాంట్లో రోజు రోజుకూ వరదనీరు పెరుగుతోంది. గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టు నీటిమట్టం శనివారం సాయంత్రానికి 14అడుగులకు చేరింది. ఇంకా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి సుమారు 500 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లో ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ కేఎన్‌బీ కృష్ణ తెలిపారు. ఇన్‌ఫ్లో వస్తున్న నేపథ్యంలో నీటి మట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. అయితే మండలంలోని ఊట్లపల్లి సమీపంలోని వెంకమ్మ చెరువు పూర్తి స్థాయిలో నిండగా.. ప్రస్తుతం వరదనీటి ప్రవహం తగ్గిపోంది. అలుగు ప్రవాహం తగ్గిపోయింది. దాంతో ఈ చెరువు దిగువలోని వాగొడ్డుగూడెం వద్ద వాగు పూర్తిగా తగ్గిపోయి, లోలెవల్ చప్టా వరదనీటి నుంచి బయట పడింది. వరద తగ్గిపోవడంతో ఈ చప్టాపై నుంచి వాహనాల రాకపోకలు పునఃప్రారంభం అయ్యాయి.

వెంకమ్మ చెరువు పరిశీలన..

మండలంలోని ఊట్లపల్లి సమీపంలోగల వెంకమ్మ చెరువును శనివారం ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసరావు పరిశీలించారు. చెరువు వద్ద వరదనీరు పరిశీలించి, నీటి పారుదల శాఖ అధికాలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు హరికృష్ణ, శ్రీరామ్మూర్తి ఉన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన


పినపాక: ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


బూర్గంపాడు: బాధితులతో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

పినపాక: వరదలకు ముంపుకు గురై సర్వం కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పాయం డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ముంపు ప్రాంతాలైన సింగిరెడ్డిపల్లి, చింతల బయ్యారం, భూపతిరావుపేట గ్రామాల్లో పర్యటించిన పాయం.. అక్కడ ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. భూపతిరావుపేట గ్రామంలో విద్యుత్ అందించడం లేదని తెలిపిన గ్రామస్తులు.. వెంటనే విద్యుత్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను వారికి వివరించారు. ప్రభుత్వం నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు తగిన సాయం అందించాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్గంపాడు: గోదావరి వరద ముంపు బాధితులకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. సారపాకలో వరదముంపు ప్రాంతాలలో శనివారం సీపీఐ బృందం విస్తృతంగా పర్యటించి బాధితులతో మాట్లాడింది. గతేడాది వరదల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం ప్రశ్నించారు. మెరక ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. ముంపునకు గురైన ప్రతి ఇంటికీ కనీసం రూ.25 వేల ఆర్థికసాయం, నిత్యావసరాలను ప్రభుత్వం అందించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోల్లోజు అయోధ్య, కమటం వెంకన్న, శ్రీనివాసరెడ్డి, జమలయ్య, మున్నా లక్ష్మీకుమారి, సురేష్, మువ్వా వెంకటేశ్వరరావు, అలవాల సీతారామిరెడ్డి, ఎండి.సాజిద్, బిక్షం, మల్సూర్, వెంకటేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవోపేతంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువజాము నుంచే ఆలయంలో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భ్రమరాంబ దంపతులు, తహసీల్దార్ భద్రకాళి, ఎంపీడీఓ అన్నపూర్ణలు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వారికి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ మేనేజర్ వెంకటరమణ ఏర్పాట్లను చేశారు.

నల్లబ్యాడ్జీలతో కార్మికుల విధులు


అశ్వారావుపేటరూరల్: నల్లబ్యాడ్జీలతోనే పారిశుద్ధ్య పనులు చేస్తున్న జీపీ కార్మికులు

దమ్మపేట: మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు, నల్ల బ్యాడ్జీలు ధరించి, పనులకు హాజరయ్యారు. శనివారం మండల పరిధిలోని అన్ని పంచాయితీల్లోని కార్మికులు నిరవధిక సమ్మెలో ఉంటూనే, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో చెత్త చెదారం నిల్వలు పెరిగిపోయిన కారణంగా, ప్రజలను దృష్టిలో ఉంచుకుని సేవాభావంతో పనులకు హాజరు అవుతున్నామని తెలిపారు. ఈ నెల 31వ తేదీన జరగబోయే తెలంగాణ రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో అయిన కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో బసవయ్య, ప్రభాకర్, చెన్నారావు, రాంబాబు, నరసమ్మ, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: జీపీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం గడిచిన 24 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారి, వీధుల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని కార్మికులు తొలగించి, బ్లీచింగ్ చల్లారు. దాంతో ప్రజానీకం చెత్తచెదారం నుంచి తాత్కాలికంగా ఉపసమనం పొందగా, ఆదివారం కూడా పారిశుద్ధ్య పనులు చేస్తారని, సీఐటీయూ నాయకులు తెలిపారు. పనులను ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సర్పంచ్ అట్టం రమ్య, ఈవో హరికృష్ణ పర్యవేక్షించారు.

ములకలపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని దీక్షా శిబిరాన్ని సందర్శించి. సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అన్నారు. వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సమ్మెలోని జీపీ కార్మికులకు భోజన ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు కొడుమూరి వీరగోపాల్, బిక్కుమళ్ల సుధాకర్, అత్యం రాంబాబు, పద్దం నర్సింహారావు, ఓబుల శెట్టి ప్రభాకర్, కుంచారపు శ్రీను, నాగయ్య, వెంకన్న, కామేశ్వరరావు, గుప్తా, అత్తం సాయి కార్మికులు అపులూరి రాంబాబు, గంటా శ్రీను, బిక్కుల శ్రీను కొక్కెరగడ్డ సతీశ్, సాయిరత్న పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

అశ్వాపురం: మండల కేంద్రం అశ్వాపురంలో ఓంశ్రీ ఆదిపరాశక్తి ఆలయం ఫంక్షన్ హాల్, మొండికుంట గ్రామంలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునారావాస కేంద్రాలను శనివారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సందర్శించారు. పునరావాస కేంద్రాలలో బాధితులతో మాట్లాడి ఏర్పాట్లు, సమస్యలు తెలుసుకున్నారు. మొండికుంట గ్రామంలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో నెల్లిపాక గ్రామానికి చెందిన వరద బాధితులు గత ఏడాది వరదలకు ఇళ్లు నీట మునిగి సర్వం కోల్పోయినా నేటికీ రూ.10 వేల పరిహారం అందలేదని రేగా కాంతారావుకు విన్నవించారు. పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని, వరదలు వచ్చినప్పుడే నాయకులు కనబడుతున్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన విప్ రేగా.. తహసీల్దార్ ఎంఏ.రాజు తో మాట్లాడి వరద బాధితులకు రూ.10 వేల నష్టపరిహారానికి సంబంధించి పరిహారం అందని వారి జాబితాపై వెంటనే నివేధిక అందజేయాలని సూచించారు. బాధితులకు అండగా ఉంటామని, ఆందోళన చెందవద్దని బాధితులకు ఆయన భరోసానిచ్చారు.

మణుగూరురూరల్: వరద బాధితుల కోసం మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని డీఎస్ఓ డాక్టర్ పర్శియా నాయక్ శనివారం సందర్శించి పరిశీలించారు. వరద బాధితుల కోసం పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. కేంద్రంలోని వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాని సూచించారు. పాముకాటు, రక్తపోటు, షుగర్ వంటి వ్యాధులకు మందులను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. షిఫ్టుల వారీగా సమయం పాలన పాటించాలని సిబ్బంది సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాల్లోని గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ గోపిలాల్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మణుగూరురూరల్: పునరావాస కేంద్రంలోని వైద్యశిబిరాన్ని సందర్శిస్తున్న డీఎస్ఓ..

దుమ్ముగూడెం: గోదావరి వరద బాధితులు ఆశ్రయం పొందుతున్న పునరావాస కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే బాలసాని లక్ష్మీనారాయణ శనివారం సందర్శించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా అన్ని విధాలుగా అండగా ఉంటామని, ముంపు లేని చోట ఇంటి స్థలం ఇప్పించి గృహలక్ష్మి పథకం ద్వారా గృహాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు మానే రామకృష్ణ, చర్ల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోదేబోయిన బుచ్చయ్య, ఎంపీపీ రేసు లక్ష్మి, కణితి రాముడు, అధికార ప్రతినిధి ఎండి.జానిపాషా, దామెర్ల శ్రీనివాసరావు, మోతుకూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

పెద్దార్లగూడెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సీపీఎం బృందం శనివారం సందర్శించింది. పునరావాస కేంద్రంలో ఉన్న ప్రతి కుటుంబానికీ రూ.15వేలు ఇవ్వాలని పార్టీ భద్రాచలం నియోజకవర్గం కోకన్వీనర్ కారం పుల్లయ్య ఈ సందర్భంగా [illegible] డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, దుమ్ముగూడెం ఎంపీటీసీ కొర్స దిలకమ్మ, సర్పంచ్ రాజేష్, ఉపసర్పంచ్ తాటిపూడి రామస్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: సీపీఎం జిల్లా బృందం శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించింది. వరద బాధిత కుంటుంబాల ప్రజలతో వారు మాట్లాడి సమస్యలు తెలుసుకుంది. పునరావాస కేంద్రానికి తరలించిన వరద బాధితులకు ప్రతి కుటుంబానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మచ్చా వెంకటేశ్వర్లు, గద్దం స్వామి, నర్సారెడ్డి, రేణుక, వెంకటరెడ్డి, లీలావతి పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

అశ్వాపురం: ఆర్లగూడెం ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సీపీఐ నాయకుడు, ఆర్లగూడెం ఎంపీటీసీ పాయం లలిత, పార్టీ జిల్లా సమితి సభ్యుడు నోముల రామిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్ పాయం రాజు, కొరస రమేష్ ,పాయం ఎర్రయ్య, కొరస కోటేష్, పాయం చలపతి, రామ చిట్టి తదితరులు సందర్శించారు.

బీజేపీ..

బూర్గంపాడు: సారపాకలోని గోదావరి వరద బాధితుల పునరావాస కేంద్రాన్ని బీజేపీ ప్రతినిధి బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే గోదావరికి కరకట్టలు నిర్మించి వరద ముంపు ప్రవాహన్ని పూర్తిగా తగ్గిస్తామని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే ముంపు బాధితులకు మెరక ప్రాంతాలలో పక్కా ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో మోరంపల్లిబంజర సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, పార్టీ నాయకులు భూక్యా సీతారామనాయక్, బిజ్జం శ్రీనివాసరెడ్డి, బాలునాయక్, బీరవ సాయిశ్రీనివాస్, కేతగాని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.